సాక్షి కామారెడ్డి

శనివారం ¦ 27 ¦ సెప్టెంబర్ ¦ 2025



ఆలయాల దోపిడీ ముఠా..

ఆలయాలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్ప డుతున్న దొంగల ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు.

- IIలో ▸



ఫెయిల్యూర్ సీఎం..

హామీలను అమలు చేయని రేవంత్‌రెడ్డి ఫెయిల్యూర్ సీఎంగా చరిత్రలో మిగిలిపో తారని మాజీ ఎమ్మెల్యే గంప పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
27.2 /21.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఒక బోరు.. 29 కనెక్షన్లు

మండల కేంద్రంలోని న్యూ బీసీ కాలనీలో 47 కుటుంబాలు నివసిస్తున్నాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్ వేసి ఇంటింటికి నల్లా కనెక్షన్లు ఇచ్చినా.. నీటిని మాత్రం సరఫరా చేయడం లేదు. కాగా ఈ కాలనీ మొత్తంలో ఒకే పబ్లిక్ బోరు బావి ఉంది. కొన్ని కుటుంబాలకు మాత్రమే సొంత బోర్లున్నాయి. మిగిలిన కుటుంబాలన్నింటికీ ఈ బోరు నీరే ఆధారం. దీంతో బోరునుంచి ఇళ్లకు వేరువేరుగా 29 పైప్‌లైన్లు ఏర్పాటు చేసుకుని వాడుకుంటున్నారు. అయితే ఈ బోరులోంచి నీరు తక్కువ వస్తుండడంతో నీటి కోసం యుద్ధాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ పథకం నీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు. – రాజంపేట

బోరు మోటారుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కనెక్షన్‌లు →



న్యూస్‌రీల్

రూ. 5,55,555తో అమ్మవారికి అలంకరణ



కామారెడ్డి టౌన్ : జిల్లాలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ అవతారంలో భక్తులను అనుగ్రహించారు. జిల్లా కేంద్రంలోని దేవివిహార్ కాలనీలోని దేవి రెసిడెన్సీ బ్లాక్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారిని రూ.5,55,555ల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'విపత్తులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం'

కామారెడ్డి అర్బన్: విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల వద్ద వినియోగదారులు ఫ్యూజ్‌లు మార్చడం, రిపేర్లు చేయడం ప్రమాదకరమని, ఏదైనా సమస్య ఉంటే 1912 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు జాతీయ స్థాయి పురస్కారాలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు నలుగురికి జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయని కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలలో పాల్గొన్నందుకు నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ యాక్టివిస్ట్స్(నిఫా) సంస్థ జాతీయ స్థాయి యంగ్ కమ్యూనిటీ చాంపియన్ సేవా రత్న పురస్కారాలు అందించిందన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు షేక్ రిజ్వాన్ అహ్మద్, ఉదగిరి రాజ్‌కుమార్, బేస మానస, రాందిన్ కుల్దీప్‌నాయర్ ఈ పురస్కారాలు అందుకున్నారన్నారు. చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నందుకు అవార్డులు దక్కాయన్నారు.

తొలి రోజు ఒకటి..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు పెట్టింది. తొలి రోజు ఒక దరఖాస్తు వచ్చింది. బాన్సువాడ నుంచి ఒక దరఖాస్తు వచ్చిందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంతరావు తెలిపారు. జిల్లాలో 49 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో కామారెడ్డి సర్కిల్ పరిధిలో 15 దుకాణాలు, దోమకొండ పరిధిలో ఎనిమిది, ఎల్లారెడ్డిలో ఏడు, బాన్సువాడలో తొమ్మిది, బిచ్కుందలో పది మద్యం దుకాణాలున్నాయి. జిల్లాలో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు ప్రస్తుతం మద్యం వ్యాపారంలో ఉన్న వారితో పాటు కొత్త వారు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. దసరా పండగ తర్వాత దరఖాస్తులు స్పీడందుకోనున్నాయి.

బోధన్-బీదర్ రైల్వే పనుల కోసం భూ పరీక్షలు



రుద్రూర్ : బోధన్ నుంచి కర్ణాటకలోని బీదర్ వరకు కొత్త రైల్వే లైన్ పనుల కోసం అధికారులు భూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) శివారులో రెండురోజులుగా భూ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్షల అనంతరం నివేదికను కేంద్ర రైల్వే అధికారులకు సమర్పించనున్నారు. గతంలో బోధన్ నుంచి బీదర్ వరకు కొత్త రైల్వేలైన్ కోసం భూసేకరణ చేసి హద్దులను గుర్తించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం భూ పరీక్షలు చేస్తుండడంతో రైల్వే లైన్ పనుల ప్రారంభంపై ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయి.

పాతకు పూత.. ఇదేమి ఆధునికీకరణ!

- కామారెడ్డి రైల్వే స్టేషన్ భవనానికి 130 ఏళ్లు
- 'అమృత్ భారత్'లో అభివృద్ధికి రూ.39.90 కోట్లు మంజూరు
- కొత్త భవనం నిర్మించకుండా పాతదానికే మరమ్మతులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. మరోవైపు శతాబ్దం క్రితం నిర్మించిన పాత భవనానికే మరమ్మతులు చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కామారెడ్డి రైల్వే స్టేషన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని రైల్వే స్టేషన్ మీదుగా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి నాందేడ్, మన్మాడ్, ముంబయి, నాగర్‌సోల్, అకోలా వంటి నగరాలకు వెళ్లే రైళ్లన్నీ ఆగుతాయి. అలాగే నిజామాబాద్, కామారెడ్డి మీదుగా హైదరాబాద్, తిరుపతి, నర్సాపూర్, అనంతపూర్, కడప, విజయవాడ, విశాఖపట్టణం, ఒడిషాలోని సంబల్పూర్ వంటి ప్రాంతాలకు వెళ్లే రైళ్ల స్టాప్‌లు ఇక్కడ ఉన్నాయి. కామారెడ్డి జిల్లాతోపాటు సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు కామారెడ్డి రైల్వే స్టేషన్ ద్వారా వెళ్తుంటారు. ముఖ్యంగా ముంబయికి రోజూ దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో వందలాది మంది ఇక్కడి నుంచే వెళతారు. రైల్వే డబ్లింగ్ పనులు పూర్తయితే రైళ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ స్కీం(ఏబీఎస్ఎస్)ను అమలు చేసింది. ఇందులో భాగంగా స్టేషన్ అభివృద్ధి కోసం రూ.39.90 కోట్లు మంజూరు చేసింది. 2023 ఆగస్టు 6న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

నత్తనడకన పనులు..

ఏబీఎస్ఎస్ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం ఉన్న భవనంలో మార్పులు చేసి వెయిటింగ్ హాల్‌ను విస్తరిస్తున్నారు. టాయిలెట్స్, ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.అలాగే స్టేషన్ ముందు భాగాన ఆధునికత ఉట్టిపడేలా తీర్చిదిద్దనున్నారు. రైల్వే స్టేషన్‌కు కావలసినంత స్థలం అందుబాటులో ఉంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని భావిస్తున్నారు. అయితే పనులు నత్తనడకన సాగుతుండడంతో గడువు ముగిసినా పూర్తికాలేదు. అన్ని పనులు పూర్తి కావాలంటే మరో ఏడాది పట్టే అవకాశం కనిపిస్తోంది.



కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ కోసం రూపొందించిన నమూనా చిత్రం



పాత భవనానికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పాత భవనానికే సొబగులు..

జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ భవనాన్ని 1896 లో నిర్మించారు. అప్పటి నిజాం పాలకులు హైదరాబాద్ నుంచి కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా మన్మాడ్‌కు రైల్వే లైన్ వేయించారు. అప్పుడే కామారెడ్డి, నిజామాబాద్ రైల్వే స్టేషన్లు నిర్మించినట్లు రికార్డులు చెబుతున్నాయి. రైల్వే స్టేషన్‌కు పలుమార్లు మరమ్మతులు చేశారు. స్టేషన్ భవనం పైకప్పు దెబ్బతింది. ఇపుడు దానికే మరమ్మతులు చేస్తున్నారు. దాదాపు 130 ఏళ్ల నాడు నిర్మించిన భవనానికే మెరుగులు దిద్దుతుండడం విస్మయం కలిగిస్తోంది. రైల్వే స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు ఎన్నో కల్పిస్తున్న ప్రభుత్వం.. శిథిలావస్థకు చేరిన స్టేషన్ భవనానికి మెరుగులు దిద్దడం బాగోలేదని పలువురు పేర్కొంటున్నారు. కొత్త భవనం నిర్మించకుండా పాత భవనానికి మరమ్మతులు చేస్తుండడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీర్ఘకాలం మన్నేలా నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.



రైల్వే స్టేషన్ పాత భవనానికి చేపట్టిన మరమ్మతులు

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ కోసం అధికారులు కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ ఒకటో తేదీన ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. ధాన్యం సేకరణపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. వానాకాలం సీజన్‌లో 5.99 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించాలన్నది లక్ష్యమన్నారు. ఇందుకోసం సొసైటీల ఆధ్వర్యంలో 233, ఐకేపీ ఆధ్వర్యంలో 194 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సరిపడా గోనె సంచులతోపాటు తగినన్ని వేయింగ్ మిషన్లు, తేమ నమోదు శాతం తెలిపే మిషన్లు, ప్యాడీ క్లీనర్స్‌ను కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. రైతులకు టోకెన్‌లు ఇచ్చి వడ్లు కొనుగోలు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని 24 గంటల్లో రైస్‌మిల్లులకు పంపించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే 08468–220051 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం..
- టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి ఆయన కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసినందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను అప్రమత్తం చేసి ఎ లాంటి ధన, ప్రాణ నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల కలిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో అధికారులందరినీ అప్రమత్తం చేసి తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంత్రితో పేర్కొన్నారు.

ఇసుక మేటలను తొలగించాలి

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదల వల్ల రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, వాటిని తొలగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఉపాధి నిధుల వినియోగం మార్గదర్శకాల జారీ గురించి సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్

'157 సెల్‌ఫోన్‌ల రికవరీ'

కామారెడ్డి టౌన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న రూ. 25 లక్షల విలువ గల 157 సెల్‌ఫోన్‌లను స్పెషల్ డ్రైవ్ ద్వారా రికవరీ చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. పోగొట్టుకున్న, చోరీకి గురయిన ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లాలో ఈ వారంలో 968 ఫోన్లు, పోర్టల్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 3,862 ఫోన్లు రికవరీ చేశామన్నారు. బాధితులు ఆర్ఎస్సై బాల్‌రాజు 87126 86114ను సంప్రదించి పోగొట్టుకున్న ఫోన్‌లను తీసుకెళ్లాలని తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్నవారు వెంటనే సిమ్ బ్లాక్ చేసి కొత్త సిమ్ తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోన్‌ల రికవరీలో ప్రతిభ చూపిన టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌లను చూపుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

- ఏఎస్పీ చైతన్యరెడ్డి

దోమకొండ : పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. శుక్రవారం ఆమె దోమకొండ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కేస్ డైరీస్, ఎఫ్ఐఆర్ రిజిస్టర్, స్టేషన్ హాజరు రిజిస్టర్, మల్టీ బుక్స్, సీసీ కెమెరాల రికార్డులు, ఆయుధాల భద్రత, లాకప్ గదులను పరిశీలించారు. అనంతరం డ్యూటీలో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట భిక్కనూరు సీఐ సంపత్ కుమార్, ఎస్సై స్రవంతి, సిబ్బంది ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

జిల్లాను వదలని వాన!

- ముసురుతో పాటు పలుచోట్ల భారీ వర్షం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- ప్రాజెక్టుల్లోకి పెరిగిన ఇన్‌ఫ్లోలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మళ్లీ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం రోజంతా కురిసిన వాన.. శుక్రవారం కొంత తెరిపిచ్చినట్టే అనిపించినా సాయంత్రం మళ్లీ మొదలయ్యింది. రాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు నుంచి నీటిని వదిలారు. దీంతో మంజీర నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులకూ వరద తాకిడి పెరిగింది. రెండు మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో పాటు సింగూరు ప్రాజెక్టు గేట్ల ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం భారీ వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం రాత్రి 77,717 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి 87,709 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రధాన కాలువకు 1,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. శుక్రవారం రాత్రి వరకు 1,401.51 అడుగుల (13.088 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కౌలాస్ ప్రాజెక్టులోకి..


కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి శుక్రవారం 4,838 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు మూడు వరద గేట్లను ఎత్తి 7,614 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా 457.85 మీటర్లు (1.200 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

మంజీర నదిలో వరద పరవళ్లు

నిజాంసాగర్ గేట్లు ఎత్తడంతో పాటు నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతుండడం, కల్యాణి ప్రాజెక్టు, సింగితం రిజర్వాయర్ అలుగులు పారుతుండడంతో మంజీర నది పరవళ్లు తొక్కుతోంది. దాదాపు 1.30 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది.



అలుగు పారుతున్న సింగితం రిజర్వాయర్



వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న మంజీర నది

క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



ఎల్లారెడ్డి: పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్డీవో పార్థసింహారెడ్డికి వినతిపత్రం అందించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని కోరారు. బీజేపీ నాయకులు బాలకిషన్, రాజేష్, నర్సింలు, కాశీ తదితరులున్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ పీహెచ్‌సీని శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభు కిరణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిబ్బంది ప్రతిరోజు ఆస్పత్రికి సకాలంలో హాజరు కావాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో ఆప్యాయంగా మాట్లాడి మందులను పంపిణీ చేయాలని సూచించారు. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ల్యాబ్ ఫార్మసీ ఇన్‌వార్డు గదులు, రికార్డులను పరిశీలించారు. మండల వైద్యాధికారిణి ఖాసిం, హెచ్‌ఈవో నారాయణ, సూపర్ వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

రైతువేదికలో మహాజన సభ



బాన్సువాడ రూరల్: తాడ్కోల్ రైతు వేదికలో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంఘం కార్యదర్శి కృష్ణమయ్య సంఘం ఆర్థిక లావాదేవిలను రైతులకు చదివి వినిపించారు. సంఘం ఆధ్వర్యంలో వరిధాన్యం డ్రైయర్ మిషన్లు కొనుగోలు చేయాలని తీర్మానించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మధుసూదన్ తెలిపారు. డైరెక్టర్లు రాంరెడ్డి, బాలరాజు, గంగారాం, శంకర్, నాయకులు జిన్న రఘు, గోపాల్‌రెడ్డి, నాందేవ్, ఇబ్రోద్దీన్, రాజిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కూలే స్థితిలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండొద్దు



బాన్సువాడ రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయే స్థితిలో ఉన్న పాత ఇళ్లలో ప్రజలు నివాసం ఉండొద్దని బోర్లం జీపీ కార్యదర్శి సాయికుమార్ సూచించారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానుల వద్దకు వెళ్లి నివాసాన్ని వేరే చోటుకి మార్చాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా షెల్టర్ కల్పిస్తామన్నారు.

మాచాపూర్ బీఎన్‌ఆర్‌కేఎస్ అధ్యక్షుడిగా విజయరావు

ఎల్లారెడ్డిరూరల్: మాచాపూర్ భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం అధ్యక్షుడిగా విజయరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు శుక్రవారం తెలిపారు. కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా పద్మారావులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చనలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పలు చోట్ల అమ్మవారు మహాలక్ష్మి, లక్ష్మీదేవి, లలితా త్రిపుర సుందరిదేవి రూపంలో దర్శనమిచ్చారు. మహిళా భక్తులు మండపాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు. భజన మండళ్ల ఆధ్వర్యంలో భజన కీర్తనలు ఆలపించారు.



దేవునిపల్లిలో పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు



అన్నాసాగర్ దుర్గామాత మండపంలో..



గుర్గుల్‌లో దేవీ మండపంలో ..



కిచ్చన్నపేటలో..



దోమకొండలో దుర్గమ్మ ఆలయానికి మంగళహారతులతో వెళ్తున్న మహిళలు



భిక్కనూరు: వాసవి మాత ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చప్పన్‌భోగ్ మిఠాయిలు



దోమకొండలో కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవి రూపంలో..



దోమకొండలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు



తాడ్వాయి: భజనలు చేస్తున్న భక్తులు



లింగంపేట: లక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత



దోమకొండలో..



బాన్సువాడలో లలితా త్రిపుర సుందరి దేవిగా..

వైభవంగా నవదుర్గావ్రతం



శ్రీనవదుర్గ వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు



వ్రతంలో పాల్గొన్న వెయ్యిమంది మహిళలు

కామారెడ్డి అర్బన్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కామారెడ్డి హౌసింగ్‌బోర్డులోని శారదమాత శక్తి పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం సహస్ర సుహాసినీలతో నవదుర్గ సహిత కోటి కుంకుమార్చన, వ్రతం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళలు పెద్ద ఎత్తున వ్రతంలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు. వేద పండితులు జి.అంజనేయశర్మ మార్గదర్శకత్వంలో అర్చకులు సతీష్‌పాండే, ఇతర అర్చకులు వ్రతం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పెంటయ్య, శ్రీధర్, శ్రీహరి, శారదా మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

ఫార్మసిస్టుల సేవలు అమూల్యమైనవి

పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజియన్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఫార్మసిస్టులు గజవాడ శ్రీనివాస్, నవిత, ఆయుష్ ఫార్మసిస్ట్‌లు కవిత, కల్పనలను సన్మానించినట్లు తెలిపారు. వైద్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైనవి, అమూల్యమైనవని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, రీజియన్ ఈఈ కిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసిస్టులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సంస్కార భారతి బతుకమ్మ సంబురాలు

కామారెడ్డి అర్బన్: సంస్కార భారతి, మాతృశక్తి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవదాన్ ఆస్పత్రి సమీపంలోని హరిత కాలనీలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాతూరి సత్యప్రసాద్, మాతృశక్తి కన్వీనర్ నాగపురి ప్రసన్న, రాజు, హరిత కాలనీ ప్రతినిధులు కృష్ణమూర్తి, వెంకటరాజం, కైలాస్ లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్టిఫికెట్లతో విజేతలు

కుక్కల బెడదను అరికట్టండి



బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో కుక్కలు రోజురోజుకు పెరుగుతున్నాయి. శునకాలు రోడ్లపై తిరుగుతూ వాహనదారుల వెంట పడి దాడులు చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం బరంగెడ్గిలో ముగ్గురు వ్యక్తులపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన మరువక ముందే మండల కేంద్రంలో శునకాలు గుంపులు గుంపులుగా సంచరించడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలమయం



దోమకొండ: మండలంలోని ముత్యంపేటలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. గ్రామంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ముందు రోడ్డు పరిస్థితి దారుణంగా తయారైంది. దోమకొండ మండల కేంద్రం నుంచి కామారెడ్డికి ముత్యంపేట మీదుగా వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పంచాయతీ పాలకవర్గం లేకపోవడం, అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. మురికి నీరు కూడా రోడ్లపైకి వచ్చి దుర్గంధం వ్యాపిస్తోందని వారు పేర్కొంటున్నారు.

బతుకమ్మ పాట

బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో...
బంగారు గౌరమ్మ ఉయ్యాలో...
మా ఇంట కొలువుండు ఉయ్యాలో...
మా కష్టాలు తీర్చు ఉయ్యాలో...
తంగేడు పూలమ్మ ఉయ్యాలో...
తెలంగాణ శోభమ్మ ఉయ్యాలో...
గునుగు పూల వైభవము ఉయ్యాలో...
గుండెలనిండా నిలిచి ఉయ్యాలో...
పసుపు పారాణమ్మ ఉయ్యాలో...
ప్రాణాల తోడమ్మ ఉయ్యాలో...
ప్రకృతిని పూజిద్దాం ఉయ్యాలో...
పాటలతో కొలుద్దాం ఉయ్యాలో...
తొమ్మిది రోజులమ్మ ఉయ్యాలో...
తొమ్మిది రూపాలమ్మ ఉయ్యాలో...
సద్దులొచ్చిన రోజు ఉయ్యాలో...
సంతోషాల క్రాంతి ఉయ్యాలో...
అట్లు సత్తుపిండ్లు ఉయ్యాలో...
ఆప్యాయత పంచె ఉయ్యాలో...
అందరొక్కటై ఆడుదాం ఉయ్యాలో...
ఆనందంగా పాడుదాం ఉయ్యాలో...
చెరువు నీరు నిండే ఉయ్యాలో...
చల్లగ లోకముండే ఉయ్యాలో...
కన్నతల్లి భూమిని ఉయ్యాలో...
కళకళలాడించే ఉయ్యాలో...
మాంగల్యం నిలబెట్టు ఉయ్యాలో...
మా మనసులు చూడమ్మ ఉయ్యాలో...
నీ దీవెన మాకిచ్చి ఉయ్యాలో...
తరతరాల సౌభాగ్యమై ఉయ్యాలో...
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...
మళ్లీ వచ్చేవరకు ఉయ్యాలో...
మరల మరల తలచుచు
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

- సుధ మర్రివాడ, టీచర్
హంగర్గాఫారం



ప్రకృతి మురిసేలా.. సంస్కృతి, సంప్రదాయానికి అద్దంపట్టేలా బతుకమ్మ పాట రాసే మహిళలకు ఇదే మా ఆహ్వానం. మీ పాటలను పంపాల్సిన వాట్సాప్ నంబర్
8332887332

ఫెయిల్యూర్ సీఎం రేవంత్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

మాచారెడ్డి : ఫెయిల్యూర్ సీఎంగా రేవంత్‌రెడ్డి చరిత్రలో మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ విమర్శించారు. శుక్రవారం పాల్వంచ మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలు బుట్ట దాఖలయ్యాయన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ద్రోహం చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దిన్, మాజీ జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, మాచారెడ్డి మండల శాఖ అధ్యక్షుడు బాల్‌చంద్రం, రాజాగౌడ్, హంజీనాయక్, కూచని శేఖర్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

పాల్వంచ మండల అధ్యక్షుడిగా రాజాగౌడ్.

బీఆర్‌ఎస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడిగా ఇసాయిపేటకు చెందిన రాజాగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ ఆయన్ను సన్మానించారు. పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు.

టేకు చెట్ల నరికివేత

- ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు



దోమకొండ: మండలం కేంద్రానికి చెందిన రైతు పున్న లక్ష్మణ్ వ్యవసాయ బావి వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికివేశారు. ఐదు చెట్లను నరికి వాటిని ఎత్తుకెళ్లారని ఈ సందర్భంగా రైతు లక్ష్మణ్ తెలిపారు. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. శుక్రవారం తెల్లవారుజామున వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా టేకు చెట్లు నరికివేసి దొంగిలించినట్లు తెలిసిందన్నారు. శనివారం ఘటనా స్థలానికి వస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపినట్లు ఆయన వివరించారు.

ధ్రువపత్రాలను అప్డేట్‌గా ఉంచుకోవాలి



పిట్లం(జుక్కల్): జిల్లా రవాణా శాఖ టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పిట్లం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవోలు చల్లా కృష్ణ తేజ, కొట్టె మధుకర్‌లు మాట్లాడుతూ.. వాహనదారులు వాహన ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాలుష్య నియంత్రణ, బీమా, డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్, వాహన పన్ను వంటి తదితర పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు.

రైతు కుటుంబం నుంచి డీఎస్పీ



కోజిగెవార్ వెంకటదీప్

బిచ్కుంద(జుక్కల్): కందర్‌పల్లి గ్రామం నుంచి ఓ రైతు బిడ్డ గ్రూప్–1లో ప్రతిభ చాటి డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. కోజిగెవార్ వెంకటదీప్ గ్రూప్–1 పరీక్షరాసి 141 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం సాధించాడు. తండ్రి నాగ్‌నాథ్ రైతు. వెంకటదీప్ మొదటగా ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు. విధుల్లో చేరిన అనంతరం యూపీఎస్సీ గ్రూప్ రాసి 4 నెలల క్రితం సెంట్రల్ అకౌంటెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. రెండు ఉద్యోగాలు సాధించినప్పటికి సంతృప్తి చెందలేదు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్–1 పరీక్ష రాసి డీఎస్పీగా ఉద్యోగం సాధించాడు. తమ తల్లిదండ్రుల సహకారం, ప్రోత్సాహంతో డీఎస్పీ ఉద్యోగం సాధించానని వెంకటదీప్ అన్నారు.

డీఎస్పీగా మాజీ సర్పంచ్ మనవడు..



మనుమడితో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామ మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి మనుమడు ప్రభాత రెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యాడు. శంకరంపేట్ మండలం ముసాపేటకు చెందిన ప్రభాతరెడ్డి శుక్రవారం ఇబ్రహీంపేట్‌కు రావడంతో మనుమడిని తాత ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు.

ఎంపీడీవోగా ఎంపికైన సౌత్‌క్యాంపస్ విద్యార్థిని

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ విద్యార్థిని కంకణాల శ్రీజారెడ్డి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. సౌత్‌క్యాంపస్‌లో జియో ఇన్ఫర్‌మేటిక్స్ ద్వితీయ సంవత్సరం చదువున్న కరీంనగర్ జిల్లాకు చెందిన కంకణాల శ్రీజారెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికైంది. శుక్రవారం సౌత్‌క్యాంపస్‌లో శ్రీజారెడ్డిని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ అభినందించి సత్కరించారు. అధ్యాపకులు నారాయణ గుప్తా, ప్రతిజ్ఞ తదితరులు పాల్గొన్నారు.



శ్రీజారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్

క్రైం కార్నర్

వ్యక్తిని మోసం చేసిన కేసులో ఇద్దరి అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఓ వ్యక్తిని మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. మండలకేంద్రం గోపాల్‌పేటకు చెందిన నాదెండ్ల వెంకటరావు ఇటుకబట్టి నిర్వహిస్తున్నాడు. బట్టిలో పనిచేయడానికి కూలీలను అప్పగిస్తామంటూ అతడి వద్ద గతయేడు నవంబర్‌లో ఒడిశాకు చెందిన సంబా, లింగం, కలియా, పూరణ్ కలిసి రూ.7లక్షల22వేల900 తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా వారు కూలీలను తీసుకురాకపోవడంతో వారిపై డిసెంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టగా సంబా, కలియా ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్నారని తెలిసింది. దీంతో పోలీసులు అక్కడి వెళ్లి వారిని పట్టుకున్నారు. అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జప్తిజాన్కంపల్లి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసునమోదు చేశామని ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. లింగంపేట మండలం పర్మల్లతండా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. డ్రైవర్లు మాలోత్ వినోద్, లాల్‌సింగ్‌పై కేసునమోదు చేశామని వివరించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి.. కాపాడిన తహసీల్దార్

నవీపేట: మండలంలోని యంచ వద్ద గల గోదావరిలో ఆత్మహత్యకు యత్నించిన ఒకరిని తహసీల్దార్ వెంకటరమణ శుక్రవారం కాపాడారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా గ్రామానికి చెందిన మహేష్ ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడి బయటకు వెళ్లాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు యంచ గోదావరి బ్రిడ్జిపైకి వచ్చాడు. నదిలో దూకేందుకు యత్నించగా అటువైపు వెళ్లిన తహసీల్దార్ వెంకటరమణ బాధితుడిని కాపాడారు. అనంతరం అతడిని ఎస్సై తిరుపతి దగ్గరకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇప్పించారు.

ఆలయాల దోపిడీ ముఠా సభ్యుల అరెస్టు

- ఆటో, నగదు, వెండి వస్తువుల స్వాధీనం
- సీసీ ఫుటేజీల ద్వారా నిందితుల గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి టౌన్: ఆలయాలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులలో ఇద్దరిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఈనెల 10న భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో పెద్దమ్మ గుడి హుండీలో నుంచి రూ.5వేలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. అలాగే ఎల్లమ్మ గుడి, ముత్యాలమ్మ ఆలయాల తాళాలు పగులగొట్టి హుండీల డబ్బులను చోరీ చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టగా ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. వారిని పట్టుకుని విచారించగా పలు చోరీల వివరాలు బయటకు వచ్చాయి. హైవేపై ఉన్న ఇళ్లు, ఆలయాలను టార్గెట్ చేసుకుని తాళాలు పగులగొట్టి విలువైన వస్తువులు చోరీలకు పాల్పడుతున్నటు గుర్తించారు. అలాగే గత నెల 19న రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లన్న గుడి, సదాశివనగర్ మండలంలో ఎల్లమ్మ గుడి, ఈ నెల 9న రామాయంపేట పరిధిలోని అయ్యప్ప ఆలయంలో హుండీలోని నగదు, వెండి పూజ సామగ్రి దొంగిలించారు. అదేరోజు భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో ఎల్లమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో హుండీలో నగదు, అమ్మవారి వెండి కళ్లు చోరీ చేశారు. పక్కనే ఉన్న ఇంటిలో బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు. జంగంపల్లి గ్రామంలో పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో హుండీ డబ్బులు దొంగలించారు. బస్వాపూర్, రామాయంపేట్‌లోని ఆలయాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ముఠా సభ్యులలో ముగ్గురిని సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన గాంధారి సత్యం, మహారాష్ట్ర లాతూర్ జిల్లాకు చెందిన సయ్యద్ సమీర్, అహ్మద్ పఠాన్‌గా గుర్తించారు. సత్యం, సమీర్ పట్టుబడగా, అహ్మద్ పఠాన్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి రెండు ఫోన్లు, ఆటో, మూడు జతల అమ్మవారి వెండి కళ్లు, వెండి దీపాలు, వస్తువులు, రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీసీఎస్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



కామారెడ్డి రూరల్: అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దేవునిపల్లి, కల్కినగర్ తదితర సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండప నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

నేడు లలితా త్రిపుర సుందరి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: స్థానిక ఎన్జీవోస్ కాలనీలోని లలితా త్రిపుర సుందరి ఆలయ 8వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా లలితా హవనం, విశేషపూజలు, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం కుమారి పూజ నిర్వహించనున్నట్లు, మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.